భారత్ - శ్రీలంక సంబంధాలు

పెద్దపులి ప్రభాకరన్ మరణించాడు. తమిళ పులులు పరాజయం పాలయ్యారు. శ్రీలంక ఊపిరి పీల్చుకుంది. దీని అర్థం జాతుల సమస్య పరిష్కారం అయిందని కాదు. ఇన్నాళ్లూ ఎల్‌టీటీఈ రాజీ లేని సాయుధ పోరాటంతో అసలు సమస్యకు రాజకీయ పరిష్కారం లభించలేదు. ఇప్పుడు ఆ వాతావరణం లేదు. ప్రాంతీయ శక్తిగా, లంక తమిళులపట్ల బాధ్యత కలిగిన దేశంగా భారత్ ప్రభావశీల పాత్ర పోషించే దిశగా అడుగులు వేస్తోంది. శ్రీలంక జాతుల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు ఇరు దేశాలు చిత్త శుద్ధితో కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీలంకతో భారత్ సంబంధాలు, తాజా పరిణామాల సమాచారం.

భౌగోళికంగా అతి దగ్గర దేశమైన శ్రీలంకతో భారత దేశానికి ప్రాచీన కాలం నుంచి మంచి సంబంధాలున్నాయి. అంతేకాక, హిందూ మహాసముద్ర ప్రాంతంలో ప్రధాన ప్రాంతీయ శక్తిగా భారత దేశానికి శ్రీలంకలో ఐక్యత, సమగ్రతలను కాపాడాల్సిన బాధ్యత ఉంది. శ్రీలంకలోని తమిళ మైనారిటీ ప్రజల ఆందోళనను, ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుంటూనే ఆ దేశం ప్రాదేశిక ఐక్యత, సమగ్రతలకు భంగం వాటిల్లకుండా వ్యవహరించడానికి భారతదేశం మొదటి నుంచి కట్టుబడి ఉంది.

భారత్–శ్రీలంక ఒప్పందం:

శ్రీలంకలో తమిళ టైగర్లు ప్రత్యేక ఈలం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్న తరుణంలో, 1987,జులై 29న భారత్, శ్రీలంకల మధ్య జరిగిన ఒప్పందంపై అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ, శ్రీలంక అధ్యక్షుడు జె.ఆర్.జయవర్ధనే సంతకాలు చేశారు. ఈ ఒప్పందమే భారత శాంతి దళం (ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్–ఐపీకేఎఫ్), ఎల్‌టీటీ ఈ (లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం)ల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఒప్పందం శ్రీలంకలోని తమిళులు, ఇతర మైనార్టీల సమస్యలను పరిష్కరించడానికి ఒక సమగ్రమైన పథకాన్ని సిద్ధం చేసింది. శ్రీలంక ఐక్యత, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకు ప్రాధాన్యం ఇచ్చింది. శ్రీలంకలోని ఒక్కో జాతి ప్రజలకు వారిదైన సంస్కృతి, భాషా అస్థిత్వాలు ఉన్నాయని వాటికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఉత్తర, తూర్పు ప్రావిన్స్‌లు తమిళ భాష మాట్లాడే ప్రజల ప్రాచీన ఆవాస ప్రాంతాలని శ్రీలంక ప్రభుత్వం ఈ ఒప్పందంలో గుర్తించింది. రెఫరెండం ద్వారా ఒక సంవత్సరంలోగా ఉత్తర, తూర్పు ప్రావిన్స్‌లను ఐక్యం చేసి ఒకే ప్రావిన్స్‌గా మార్చడానికి ఒప్పందం ద్వారా మార్గం సుగమమైంది. అన్ని మిలిటెంటు గ్రూపులు తమ ఆయుధాలను విసర్జించి చట్టబద్ధ పాలనకు వీలైన చక్కటి ప్రశాంత వాతావరణం కల్పిస్తేనే ఒకే ప్రావిన్స్ ఏర్పాటు వీలవుతుందని ఒప్పందం చెబుతోంది.

శాంతి దళాల ఉపసంహరణ:

ఎల్‌టీటీఈతో అనేక దఫాల చర్చల అనంతరం, పద్నాలుగు నెలల పాటు ఇరు పక్షాలు కాల్పుల విరమణ

పాటించాలని శ్రీలంక అప్పటి అధ్యక్షుడు ప్రేమదాసే తమిళ టైగర్లతో ఒప్పందం (1989-90) కుదుర్చుకున్నారు. ఫలితంగా శ్రీలంక నుంచి భారత దేశం తమ శాంతి దళాలను ఉపసంహరించుకుంది. శ్రీలంకలో భారత శాంతి దళాల జోక్యం వల్ల 1200 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు. అంతేకాక 1991లో భారత ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకు గురయ్యారు.

శ్రీలంకలో 1994లో ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో కుమారతుంగ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. ఇది భారత్, శ్రీలంకల మధ్య పరస్పర నమ్మకం, విశ్వాసాల ప్రాతిపదికగా ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు అనువైన వాతావరణాన్ని కల్పించింది. అయితే ఎంతో కాలం నిలవలేదు. ఎల్‌టీటీఈ దాడులను ఉధృతం చేసింది. దీంతో 2002లో ఎల్‌టీటీఈతో శ్రీలంక ప్రభుత్వం కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అయినా అంతర్యుద్ధం ఆగలేదు. 2005లో అధికారంలోకి వచ్చిన రాజపక్సే ప్రభుత్వం తమిళ టైగర్లపై ప్రత్యక్ష యుద్ధాన్ని ప్రకటించింది. చివరకు 2009లో శ్రీలంక సైన్యం ఎల్‌టీటీ ఈని పూర్తిగా తుడిచిపెట్టింది.

యుద్ధానంతరం భారత్ వైఖరి:

ఎల్‌టీటీఈ సాయుధ తిరుగుబాటును పూర్తిగా అణిచి వేసినట్లు శ్రీలంక అధ్యక్షుడు మహీంద్ర రాజపక్సే 2009 మే 18న ప్రకటించారు. దీంతో ఇక జాతి ఘర్షణలకు దారి తీసిన తమిళ మైనార్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి శ్రీలంక నడుం బిగించాలని భారత్ కోరుకుంటోంది. దీనికనుగుణంగా శ్రీలంకలో తమిళులతోపాటు అన్నివర్గాలకు చెందిన ప్రజలు భద్రత, గౌరవం, స్వేచ్ఛతో కూడిన వాతావరణంలో జీవించే విధంగా దేశరాజ్యాంగ పరిధిలో అధికార సంక్రమణాన్ని అమలుచేయడానికి పటిష్టమైన రాజకీయ చర్యలు తీసుకోవాలని భారత విదేశాంగశాఖ శ్రీలంక ప్రభుత్వాన్ని కోరింది. జాతి ఘర్షణల్లో నిరాశ్రయులైన వారికి పునరావాసంతోపాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు తమ దేశం పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని భారత్ హామీనిచ్చింది. ఉత్తర, తూర్పు ప్రావిన్స్‌ల్లో శ్రీలంక తమిళుల సౌకర్యవంతమైన జీవనానికి, భద్రతకు, ప్రభుత్వంలో తాము ఒక భాగమన్న భావనకు భరోసా కల్పించే దిశగా శ్రీలంక ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత్ కోరింది. ఉమ్మడి జాబితాలోని కొన్ని అంశాలను రాష్ట్ర జాబితాకు మార్చడానికి, సమాఖ్య ప్రాతినిధ్యం కోసం రెండో చట్టసభ ఏర్పాటుకు వీలుగా 13వ రాజ్యాంగ సవరణను అమలు చేస్తామని శ్రీలంక ప్రభుత్వం పూర్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని భారత్‌గుర్తుచేసింది.

మానవతా సాయం:

ఘర్షణలతో చెల్లాచెదురైన లంక ప్రజలను ఆదుకునేందుకు భారత్ ఇప్పటికే రూ.100 కోట్ల సాయం ప్రకటించింది. దీనికి తోడు తమిళనాడు రాష్ట్రప్రభుత్వం రూ.25 కోట్ల సహాయం అందించింది. ఒక్కొక్క కుటుంబానికి మూడు వారాలకు సరిపడే అన్ని ఆహార పదార్థాలతోపాటు, టెంట్ల వంటి ఆవాస

పరికరాలతో కూడిన లక్ష ఫ్యామిలీ ప్యాక్‌లను భారత్ శ్రీలంకకు పంపింది. నిరాశ్రయులైన పౌరులను ఆదుకునేందుకు రూ.500 కోట్లతో ఒక సహాయ ప్యాకేజి అందచేయడానికి భారత్ నిర్ణయించింది. యుద్ధఘర్షణల్లో బాగా దెబ్బతిన్న శ్రీలంక ఉత్తర ప్రాంతంలోని లంక తమిళులకు సాయం అందించే ందుకు 2009, మే 22న 27 మందితో కూడిన డాక్టర్లు, పారామెడికల్ బృందాన్ని రూ.3 కోట్ల విలువైన మందులను భారత దేశం పంపింది. 2009 మార్చి నుంచి శ్రీలంక ఈశాన్య తీర ప్రాంతంలో 62 మంది వైద్య సిబ్బందితో 110 పడకల ఎమర్జెన్సీ ఆస్పత్రిని నిర్వహిస్తోంది. అలాగే 2008 నవంబర్ నుంచి ఒక కుటుం బానికి అవసరమయ్యే రేషన్ సరుకులు, వ్యక్తిగత శుభ్రతకు సంబంధించిన వస్తువులు, దుస్తులు, వంటసామాగ్రి, నీటిశుద్ధి మాత్రలతో కూడిన 1.7 లక్షల ఫ్యామిలీ కిట్‌లను భారత్ పంపిణీ చేసింది.

భారత్ చొరవ:

శ్రీలంకలో నిరాశ్రయులైన 2.7 లక్షలమంది పౌరుల సంక్షేమం, జాతి ఘర్షణల నివారణలకు ఒక రాజకీయ పరిష్కారం కనుగొనేందుకు లంక ప్రభుత్వ అధికారులతో చర్చించడానికి జాతీయ భద్రతా సలహాదారు ఎం.కె.నారాయణన్, అప్పటి విదేశాంగ కార్యదర్శి శివశంకర్ మీనన్‌లను ప్రత్యేక దూతలుగా భారత్ పంపింది. నిరాశ్రయులకు తిరిగి వారి స్వస్థలాల్లో పునరావాసం కల్పించడం, వారు మామూలు జీవితం గడిపేందుకు అవసరమైన అన్ని ప్రాథమిక వసతులను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయడం తక్షణ కర్తవ్యాలుగా ఇరు దేశాలు గుర్తించాయి. మందుపాతరలను నిర్వీర్యం చేసిన ప్రాంతాల్లో ప్రజలు నివసించడానికి కావాల్సిన అన్ని వసతుల కల్పనకు, గృహాల పునర్నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందించడానికి భారత్ హామీ ఇచ్చింది. మారిన పరిస్థితుల్లో శ్రీలంకలో శాంతి, సామర్యాల పునరుద్ధరణకు తమిళ పార్టీలతో పాటు దేశంలోని అన్ని పార్టీలతో విస్తృతంగా చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు శ్రీలంక ప్రభుత్వం ప్రకటించింది. భారత్ ప్రత్యేక దూతలు శ్రీలంక ప్రభుత్వంతోనేగాక ఆ దేశంలోని ఇతర ఉన్నతాధికారులు, తమిళ్ నేషనల్ అలియెన్స్(టీఎన్ఏ), శ్రీలంకన్ ముస్లిం కాంగ్రెస్‌తోసహా అనేక ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చలు జరిపి అభిప్రాయాలు తెలుసు కున్నారు.

పరస్పర హామీలు:

శ్రీలంకలో జాతి కలహాలు, టెర్రరిజం తిరిగి తలెత్తే పరిస్థితి పూర్తిగా అంతరించిందని భారత్ అభిప్రాయపడుతోంది. ఇటువంటి మహదావకాశాన్ని శ్రీలంక వినియోగించుకుని రాజకీయ విజ్ఞతతో తమిళ వర్గాలతోపాటు అన్ని మైనార్టీ గ్రూపుల న్యాయమైన ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని ప్రజాస్వామ్యపంథాలో వాటి సాకారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేసింది. అలాగే శ్రీలంక ప్రభుత్వం కూడా నిరాశ్రయులైన ప్రజలు 180 రోజుల్లోగా తిరిగి స్థిరపడేందుకు పలు కార్యక్రమాలను చురుకుగా అమలుచేస్తోంది. శ్రీలంక, భారత్‌ల మధ్య సముద్ర జలాల్లో మన జాలర్ల భద్రత విషయంలో భారత్

ఎంతో శ్రద్ధ వహిస్తోంది. తమిళ టైగర్ల పరాజయం అనంతరం శ్రీలంకలో భారత్ ప్రభావవంత మైన పాత్ర పోషించేందకు అవకాశం ఏర్పడింది. యుద్ధానంతరం ఎంతో నష్టపోయిన శ్రీలంక ఉత్తర, తూర్పు ప్రాంతంలో పునరావాస, పునర్‌నిర్మాణ కార్యక్రమాల్లో భారత్ చురుకైన పాత్ర పోషించాలని ఇది అక్కడి మెజారిటీ, మైనార్టీ ప్రజల్లో సానుకూల ప్రభావాన్ని చూపుతుందని తద్వారా అక్కడ ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందని విశ్లేషకుల భావన. శ్రీలంకలో జాతుల ఘర్షణకు మూల కారణాన్ని అన్వేషించి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా భారత్ కృషి చేయడానికి ఇదే సరైన సమయమని వారు భావిస్తున్నారు.

శ్రీలంక.. చరిత్రలో ప్రధాన ఘట్టాలు:

- శ్రీలంకలో తమిళ, సింహళుల మధ్య వైరం ఇప్పటిదికాదు. క్రీ.పూ.145 లోనే తమిళ రాజైన ఎల్లర (ఇతని పేరు మీదనే ఈలం వచ్చింది) సింహళ రాజైన ధుట్ట మినిల మధ్య జరిగిన యుద్ధంతో.. తమిళ, సింహళుల మధ్య వైరం ప్రారంభమైందని చరిత్ర చెబుతోంది.
- టీ, కాఫీ, కొబ్బరి పంటల సాగుకు భారత్‌లోని తమిళనాడు నుంచి తమిళ శ్రామికులను సిలోన్(నేటి శ్రీలం క)కు తీసుకురావడం 1815లో ప్రారంభమైంది.
- 1948లో సిలోన్ స్వాతంత్ర్యం పొందింది.
- భారత దేశం నుంచి వెళ్లిన తమిళ శ్రామికుల ఓటు హక్కును 1949లో రద్దుచేశారు. దీంతో తమిళ, సింహళ జాతుల మధ్య అంతరం పెరుగుతూ వచ్చింది.
- 1956లో ప్రధానిగా ఎన్నికైన సాల్మన్ బండారు నాయకే సింహళ భాషను ఏకైక అధికార భాషగా ప్రకటించారు.
- 1972లో సిలోన్ పేరును శ్రీలంకగా మార్చారు. బౌద్ధ మతాన్ని దేశ అధికార మతంగా గుర్తించారు.
- సాయుధ పోరాటంతోనే తమ హక్కులను పరిరక్షించుకోగలమన్న భావన తమిళుల్లో బలపడి,1976లో లిబరే షన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం–ఎల్‌టీటీఈ ఏర్పడింది.
- 1983లో ఎల్‌టీటీఈ శ్రీలంక ప్రభుత్వంపై సాయుధ పోరాటానికి దిగడం ద్వారా 'మొదటి ఈలం వార్'ను ప్రారంభించింది.
- 1985లో శ్రీలంక ప్రభుత్వం,ఎల్‌టీటీఈల మధ్య శాంతి చర్చలు విఫలమయ్యాయి.
- 1987లో భారత్, శ్రీలంకల మధ్య శాంతి ఒప్పదం కుదిరింది.
- 1989లో శ్రీలంక నుంచి భాతర శాంతి దళాలను ఉపసంహరించారు.
- 1991లో భారత ప్రధాని రాజీవ్ గాంధీ ఎల్‌టీటీఈ మానవ బాంబు చేతిలో హత్యకు గురయ్యారు.
- 1994లో కుమారతుంగ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, కొంతకాలం శాంతి వాతావరణం ఏర్పడినప్పటికీ ఇరుపక్షాల మధ్య అంతర్యుద్ధం కొనసాగింది.
- 2002లో శ్రీలంక,ఎల్‌టీటీఈల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.

- 2005 అధ్యక్ష ఎన్నికల్లో రాజపక్సే విజయం.
- 2006లో ఎల్‌టీటీఈని సమూలంగా నిర్మూలించనిదే శ్రీలంక సైన్యం విశ్రమించదని రాజపక్సే ప్రకటించారు.
- 2008లో ఎల్‌టీటీఈ కాల్పుల విరమణ ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించింది.
- 2009లో శ్రీలంక సైన్యం టైగర్ల స్థావరాలను పూర్తిగా ఆక్రమించుకుని, ఎల్‌టీటీఈ అధినేత ప్రభాకరన్‌ను తుదముట్టించాయి. దీంతో అంతర్యుద్ధం ముగిసింది.